క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


స్వామికి పూలమాల వేస్తున్న వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లో వేంచేసియున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు అభిషేకాలు, హోమాలు చేశారు. స్వామిని కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సత్యనారాయణ, లోకేష్, కనకరాజు, జగ్గారావు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీల్లో జాతరలు నేడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో మంగళవారం జాతరల సందడి నెలకొననుంది. పెదమడక గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు చేశాయి. సెక్టార్-1లోని పినమడక, పూడివానిపాలెం, కొత్తూరు గ్రామాల ఇలవేల్పు బోయమాంబ అమ్మవారి పండగ అనుపు మహోత్సవం కూడా మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ధనంత్ కుటుంబసభ్యులకు ఎంపీ జీవీఎల్ పరామర్శ


ధనంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ జీవీఎల్ తదితరులు

పెదగంట్యాడ: గత నెలలో మలేషియాలో షిప్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందిన కె. ధనంత్ కుటుంబసభ్యులను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సోమవారం పరామర్శించారు. ధనంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు కూడా వారిని పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కరణంరెడ్డి నరసింగరావు, పెంటయ్య, పేర్ల అప్పారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన రాజు(ఫైల్)

సింహాచలం: సింహాచలం నుంచి గోపాలపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీనివాస్‌నగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. జీవీఎంసీ 93వవార్డు ప్రహ్లాదపురంలో నివసిస్తున్న కంబాల రాజు(39) రాడ్ బెండింగ్ వర్కు చేస్తున్నాడు. సింహాచలంని గోశాల వద్ద పనికి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. శ్రీనివాస్‌నగర్ సమీపంలో ఉన్న కారు వాషింగ్ వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నాగరాజు కిందపడిపోయాడు. బస్సు వెనుక చక్రాలు తలపై నుంచి వెళ్లిపోవడంతో రాజు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పెందుర్తి లాఅండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాలుష్య కోరల్లో నిర్వాసిత కాలనీలు

- విషపూరితమవుతున్న పరిసర ప్రాంతాలు
- రోగాల బారిన పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


కాలనీల మధ్య ఉన్న పరిశ్రమలు


నిర్వాసిత కాలనీ మధ్యలో ఉన్న పరిశ్రమల నుంచి భారీ స్థాయిలో వెలువడుతున్న పొగ

కూర్మన్నపాలెం: ఉక్కు నిర్వాసిత కాలనీలైన తిరుమల నగర్, సిద్ధార్థ నగర్, వడ్లపూడి ఎస్సీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, గణేష్ నగర్ తదితర కాలనీ ప్రజలు కాలుష్యంతో సతమతమవుతున్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, వ్యర్థాల కారణంగా వేలాదిమంది ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడేవారు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ పరిశ్రమల నుంచి ఎప్పటికప్పుడు విడుదలవుతున్న ధూళితో పాటు శబ్దాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కాలనీలకు సమీపంలో గ్రానైట్, వైర్ రాడ్ మిల్, స్టీల్ పరిశ్రమలు, ప్లాస్టిక్ తయారీ పరిశ్రమలు ఉండడంతో, వాటి నుంచి వచ్చే విష రసాయనాల కారణంగా కాలనీలన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. జనజీవనం అధికంగా ఉండే కాలనీలకు సమీపంలో ఇటువంటి పరిశ్రమలకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతులను ఏ విధంగా మంజూరు చేసిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పరిశ్రమలు వదులుతున్న కాలుష్యపూరిత గాలికి శ్వాస తీసుకోలేక సతమతమవుతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు.

ఫిర్యాదు చేసినా కానరాని చర్యలు

దశాబ్దాల క్రితమే ఏర్పాటైన లేఅవుట్లలో పరిశ్రమలు లేనట్లుగా చూపడంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు, చిన్న తరహా వ్యాపారులు సుఖంగా జీవించవచ్చనే ఆశతో ప్లాట్లు కొనుగోలు చేశారు. ఐవోసీఎల్, షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, హెచ్‌పీసీఎల్, ఇతర సంస్థలకు చెందిన ఉద్యోగులు ఈ కాలనీల్లో నివాసముంటున్నారు. నాడు ప్రశాంత జీవనం గడిపిన వారు నేడు కాలుష్య కోరల్లో చిక్కుకున్నామని ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ అధికారులకు, కాలుష్య నియంత్రణ మండలికి వినతి పత్రాలను సమర్పించినా ఎటువంటి పరిష్కార చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


జనావాసాల మధ్య నిర్వహిస్తున్న పరిశ్రమ

కంటి సమస్యలు



స్టీల్ పరిశ్రమల్లో తుప్పు పట్టిన ఇనుప సామాన్లు లోడింగ్ మరియు అన్‌లోడింగ్ చేస్తారు. ఆ సమయంలో ఇనుము నుంచి వచ్చే తుప్పు పట్టిన ధూళి వల్ల కంటి సమస్యలు వస్తున్నాయి. దీంతో పాటు దుమ్ము, ధూళితో ఇంట్లో చేరి, ఇబ్బంది పడుతున్నాం.
– శ్రీలక్ష్మి, స్థానికురాలు

ఘాటు వాసనతో ఇబ్బంది



ఆయిల్ రీసైక్లింగ్ పరిశ్రమ వల్ల నిత్యం సమస్యే. ఆయిల్‌ను మండించేప్పుడు వెలువడే ఘాటు వాసనతో ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయి. పరిశ్రమ యాజమాన్యాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఎవరికి చెప్పాలో తెలియడం లేదు.
– విశ్వేశ్వరరావు, తిరుమల నగర్ సెక్రటరీ

అధికారులు దృష్టి సారించాలి



పరిశ్రమల నుంచి ఉదయం, సాయంత్రం విషపూరిత వాయువులు వెలువడుతుండడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. సమస్యపై గతంలో కలెక్టర్‌కు, కాలుష్య నియంత్రణ మండలికి, పర్యావరణ పరిరక్షణాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. కంటి తుడుపు చర్యలు తప్ప శాశ్వత నివారణ చర్యలు మాత్రం చేపట్టడం లేదు.
– నాగభూషణం, తిరుమలనగర్ ప్రెసిడెంట్

సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపుదలపై హర్షం


డీఈ, ఏడీఈలను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: అగనంపూడిలోని విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచడంతో స్థానిక ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. లో ఓల్టేజీ సమస్య, అప్రకటిత విద్యుత్ కోతల నుంచి విముక్తి లభించనుందన్నారు. ఈ సందర్భంగా అగనంపూడికి చెందిన అఖిలపక్షాల నాయకులు ఈపీడీసీఎల్, ఆర్ఈసీఎస్ అధికారులను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డీఈ కె.రాజశేఖర్, ఏడీఈ పి.వేణుగోపాల్‌ను ఘనంగా సత్కరించారు. అగనంపూడిలో అపార్ట్‌మెంట్లు, గృహ సముదాయాలు పెరగడంతో విద్యుత్ వాడకం పరిమితికి మించి ఉంటోంది. దీంతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, వారు అధికారులకు సమస్య తెలిపారు. స్పందించిన అధికారులు విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏ స్థాయి నుంచి పది ఎంవీఏ స్థాయికి రూ.65 లక్షలతో పెంచేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. మరో ఆరు నెలల్లో కొత్త సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలియజేశారు. ఆర్ఈసీఎస్ ఏడీఈలు డి.శివశంకర్ ప్రసాద్, బి.కనకారావు, సురేష్, ఏఈ లక్ష్మణరావు, నాయకులు నెల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


రెండో అంతస్తులో కొంతభాగం కూల్చివేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాన్ని హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది సోమవారం కూల్చి వేశారు. వివరాలివి..69వ వార్డు నాతయ్యపాలెంలో గంగునాయుడు, నాయుడు రెండంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని ఓ వ్యక్తి హైకోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది కోర్టు సిబ్బంది సమక్షంలో బందోబస్తు నడుమ రెండో అంతస్తులోని ఎలివేషన్‌ను, ప్రహరీని కొంతమేర కూల్చివేశారు.

సుధాకర్ గెలుపుతో మరింత అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- గాజువాకలో విస్తృత ప్రచారం


ఎమ్మెల్సీ ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న సుబ్బారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై అవగాహన ఉండడంతో పాటు, అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 66, 71, 72, 73 వార్డుల పరిధిలోని పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావంతుడైన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు రాజాన వెంకటరావు, సిరట్ల వాసు, పూర్ణానందశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమావేశం

గాజువాక: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కోరారు. గాజువాకలోని చలపతి, ఓక్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులను సోమవారం కలుసుకుని, సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఓటు వేసే విధానాన్ని ఉపాధ్యాయులకు వివరించారు. ఈ సందర్భంగా అభ్యర్థి సుధాకర్‌ను ఉపాధ్యాయులకు పరిచయం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని, అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

- విద్యావంతులైన ఉపాధ్యాయులు ఒక్కసారి ఆలోచించాలని, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని సుబ్బారెడ్డి కోరారు. పెదగంట్యాడ మండలంలోని టింపనీ స్కూల్‌లో ఉపాధ్యాయులతో సోమవారం సమావేశమయ్యారు. విశాఖను ప్రగతి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి, పాఠశాలల చైర్మన్ ఎ.బాలరెడ్డి, వారణాసి దినేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జింక్ మైదానంలో..

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్థానిక హిందూస్థాన్ జింక్ మైదానంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్‌కు వచ్చిన పట్టభద్రులను కలుసుకొని వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన కరపత్రాలను పట్టభద్రులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ సాయి అనూష, మహ్మద్ ఇమ్రాన్, బొడ్డు నర్సింహ పాత్రుడు, నాయకులు మార్టుపూడి పరదేశి, ఎస్ఎండీ గౌస్, అండిబోయిన లక్ష్మి, మద్దాల అప్పారావు, గొందేశి రమణారెడ్డి, వెంపాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి 67వ వార్డులోని వివిధ పాఠశాలల్లో సోమవారం ప్రచారం చేశారు. ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు ఎస్ఎండీ గౌస్, రాజేష్, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న జీవీఎల్ నర్సింహారావు తదితరులు

ఎంపీ జీవీఎల్ ప్రచారం

బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌కు మద్దతుగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు గాజువాకలో సోమవారం ప్రచారం నిర్వహించారు. బీసీ రోడ్, గాజువాక హైస్కూల్ రోడ్‌లోని వివిధ విద్యా సంస్థలలో ఉపాధ్యాయులను కలిసి మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని తిరుమలనగర్, ఎన్టీఆర్ కాలనీ, శివాజీనగర్‌లలో ఉన్న ఓటర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు.

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు, ఏపీ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు ప్రచారం నిర్వహించారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు విరోతి రాము, కాకి అప్పల రెడ్డి, కృష్ణంరాజు, సలాది వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభం



చర్చి పక్కన ఏర్పాటు చేసిన కొత్త పోల్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని జేసీపీ అండ్ ఈహెచ్‌ఎఫ్ చర్చి పక్కన కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. గతంలో ఇనప స్తంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉండేది. దీనిపై 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మింది విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులు సోమవారం కొత్త విద్యుత్ పోల్‌ను ఏర్పాటు చేశారు. ఏఈ భీమరాజు ఆధ్వర్యంలో పోల్ ఏర్పాటు చేయడంతో పాటు ఇదే లైన్‌లో గల మరో మూడు స్తంభాలకు కొత్త కండక్టర్లు ఏర్పాటు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

జాతీయ స్థాయి సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెక్టార్ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ అరుంధతి

అగనంపూడి: ఎలక్ట్రికల్ వాహనాల్లో వస్తున్న పోకడలు, సవాళ్లు అనే అంశంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు. వాహనాల ప్రాధాన్యతపై 5 రోజుల వర్క్‌షాపు ఉంటుందన్నారు. సదస్సులో ఐఐటీలు, కేఐఐటీల నుంచి నిపుణులు, నిష్ణాతులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ కో–ఆర్డినేటర్లు సీహెచ్.రమణ, సుశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు అభినందన


మంత్రి అమర్‌నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతంగా ముందుండి నడిపించడంలో ప్రధాన పాత్ర పోషించిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను వైఎస్సార్ టీయూసీ నాయకులు అభినందించారు. 68వ వార్డు మిందిలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి, పుష్పగుచ్ఛాలను అందించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ దాదాపు 15 కీలక రంగాల్లో రాష్ట్రానికి పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేలా ప్రఖ్యాత వ్యాపార దిగ్గజాలతో ఎంవోయూ జరిగిందన్నారు. మంత్రిని కలిసిన వారిలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు వై.మస్తానప్ప, ఎన్నేటి రమణ, గొంతిన వెంకటలక్ష్మి, పిట్టారెడ్డి, అండిబోయిన లక్ష్మి, ద్వారంపూడి బ్రహ్మం తదితరులున్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం


ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 753వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు కూర్చుని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించేది లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కార్మికుల జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలంటే ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

మహిళా హక్కులపై అవగాహన అవసరం


సదస్సును ప్రారంభిస్తున్న ఆదికవి నన్నయ వర్సిటీ మాజీ వీసీ జగన్నాథరావు

అగనంపూడి: మహిళా హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.జగన్నాథరావు అన్నారు. అప్పుడే సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు తమ పాత్రను పోషించే స్థాయికి ఎదగగలరన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో మహిళల హక్కులపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు, చట్టాలు, భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, మానవహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్, సామాజిక కార్యకర్త మాధవీ గణపతి, రిటైర్డ్ సీఐ వెంకటరమణ తదితరులు మాట్లాడారు.

వైభవంగా వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న గౌతంరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి సైమన్ నగర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన పూజల్లో ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పి. గౌతంరెడ్డి దంపతులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా అగ్ని ప్రతిష్ఠ, నిత్య పూర్ణాహుతి, విష్ణు సహస్రనామ పారాయణం, అన్నకూటోత్సవాలను ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గిరిజనులకు గోవుల అందజేత


గోసంపదను అప్పగిస్తున్న దేవస్థానం అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పలువురు గిరిజనులకు సింహాచలం దేవస్థానం గోశాలలోని దేశవాళీ గోవులను సోమవారం దేవస్థానం అధికారులు అందజేశారు. పెదబయలు మండలంలోని ఇంజరి, దమదంగి, కొత్తూరు, కింతలి గ్రామాల్లో పిడుగులు పడి సుమారు 150 పశువులను గిరిజనులు కోల్పోవడంతో సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల నుంచి ఆయా గిరిజనులకు పశుసంపద అందజేయాలని ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీ లిఖితపూర్వకంగా దేవస్థానం అధికారులను కోరారు. ఇటీవల జరిగిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశంలో ఆ విషయంపై తీర్మానం చేసి సభ్యులు ఆమోదించారు. దీంతో సోమవారం అధికారులు 138 వరకు గోవులు, గిత్తలు, కోడెదూడలను అందజేశారు. అల్లూరి జిల్లా డీఎస్పీ కె.వెంకటరావు, మాడుగుల సీఐ ఎ. సత్యనారాయణ, పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్, అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ రాజారవికుమార్ సమక్షంలో దేవస్థానం అధికారులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, పంచాడి పద్మ, దేవస్థానం గోశాల పర్యవేక్షకుడు హరి రాజు, ఏఈవో శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు పాల్గొన్నారు.